క్లుప్తంగా

రైతుబజారు ఎస్టేట్ ఆఫీసర్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న చెట్టి కృష్ణమూర్తి

సీతమ్మధార : సీతమ్మధార రైతుబజారు ఎస్టేట్ ఆఫీసర్‌గా చెట్టి కృష్ణమూర్తి సోమవారం బాధ్యతలు చేపట్టారు. నాలుగు రోజుల క్రితం రైతుబజారు ఎస్టేట్ ఆఫీసర్లను జాయింట్ కలెక్టర్ బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కంచరపాలెం రైతుబజారులో విధులు నిర్వహిస్తున్న కృష్ణమూర్తిని సీతమ్మధార రైతుబజారుకు బదిలీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న కొండబాబును నర్సింహనగర్‌కు బదిలీ చేశారు. ఈ నేపథ్యంలో కృష్ణమూర్తికి బజారులోని రైతులు, సహాయకుడు సతీష్ మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు.

మిద్దె తోటల నగరంగా తీర్చిదిద్దుదాం

జోనల్ కమిషనర్ శివప్రసాద్



మొక్కలు పంపిణీ చేస్తున్న జెడ్సీ శివప్రసాద్, తదితరులు

సీతమ్మధార : మిద్దె తోటల నగరంగా విశాఖను తీర్చిదిద్దుదామని జోన్ – 3 జోనల్ కమిషనర్ పి.శివప్రసాద్ పిలుపునిచ్చారు. జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్ ఆదేశానుసారం గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జీవో నేతృత్వంలో సోమవారం కూరగాయల మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్బన్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ విభాగంలోని వారంతా తమ ఇంటి వద్ద కూరగాయల వ్యర్థాలు ఎరువుగా తయారు చేసుకోవాలని సూచించారు. సాధ్యమైనంత వరకూ ఇంటి మీద, బాల్కనీలో, ఇంటి చుట్టూ ఉన్న ఖాళీ ప్రదేశాల్లో కూరగాయలు, ఆకుకూరలు సేంద్రియ పద్ధతిలో పండించుకోవాలని కోరారు. ప్రకృతి ఆధారిత పంటలే ఆరోగ్యకరమని, దేశీయ విత్తనాలతో పంటలు పండించడం అవసరమన్నారు. అనంతరం యూసీడీ ఏపీడీ ఎల్.రాము మాట్లాడుతూ ఆరోగ్యకరమైన ఆహారం అందరికీ అవసరమన్నారు. మన ఇంటి పంట కార్యక్రమం జయప్రదం చేయాలని కోరారు. గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జీవో వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం మాట్లాడుతూ బత్తిలి, వంజంగి ప్రాంతాలకు చెందిన వంకాయ, బాపట్ల మిర్చి, నాటు టమాటా, బంతి నారులతో మొక్కలు ఇస్తున్నామన్నారు. బాగా పెంచి ప్రతి ఒక్కరూ 8333849955కు ఫొటోలు వాట్సాప్ చేయాలని కోరారు. కార్యక్రమంలో జె.రాజేశ్వరి, పి.సాయి, తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు యువతులకు ఆశ్రయం



యువతులతో ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు

సీతమ్మధార: విశాఖపట్నంలో రైల్వే పోలీసులు, ఏయూటీడీ సంస్థ కలిసి మానవ అక్రమ రవాణా వ్యవహారం గుట్టు రట్టు చేశారు. ఒడిశాలోని నవరంగపూర్ తదితర ప్రాంతాల నుంచి అమ్మాయిలను తరలిస్తున్నట్లు గుర్తించిన రైల్వే పోలీసులు ఏయుటీడీ అధికారులతో కలిసి టీఎస్సార్ మహిళా షెల్టర్‌కు ఆదివారం రాత్రి తరలించారు. అమ్మాయిల పేర్లు సైత భత్ర (20), సుభద్ర భత్ర (19) అని, అంతకు మించి వివరాలు వెల్లడించడం లేదని ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. ఈ యువతులను తీసుకెళ్లడం కోసం ఎవరెవరో వ్యక్తులు షెల్టర్‌కు వస్తున్నారని, ఇదే విషయమై రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశామని ఆయన తెలిపారు.

నాడు
జగనన్న ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల తాగునీటి ఇక్కట్లు తీరాయి. కార్పొరేట్ స్కూళ్లలో సైతం లేని విధంగా జీవీఎంసీ పాఠశాలల్లో లక్షలాది రూపాయలు వెచ్చించి బల్క్ ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేశారు. నిరంతరం ఆర్వో మిషన్ల ద్వారా మినరల్ వాటర్ వచ్చే విధంగా ప్రతి స్కూల్‌లో ప్లాంట్లు ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి విద్యార్థులు ఇంటి నుంచి వాటర్ బాటిల్ తీసుకురావాల్సిన అవసరం **లేకపోయింది. ఆర్వో ప్లాంట్ల నిర్వహణకు ప్రత్యేక చర్యలు చేపట్టారు.**

నేడు
కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్లు నిర్వహణ లోపాలతో మూలకు చేరాయి. ఫలితంగా సురక్షిత తాగునీరు అందించాల్సిన ఆర్వో ప్లాంట్లు అలంకారప్రాయంగా మారాయి. మరలా ఎప్పటిలా విద్యార్థులు ఇళ్ల నుంచి బాటిల్స్‌తో మంచి నీరు తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది. గతంలో జీవీఎంసీ నుంచి వాటర్ క్యాన్లు సరఫరా చేసేవారు. ప్రస్తుతం ఆ వాటర్ క్యాన్‌లు కూడా రావడం లేదు. **బోరు నీరు, కుళాయి నీరు తాగాల్సిన పరిస్థితి నెలకొంది.**

అలంకారప్రాయమే..!

- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 'నాడు – నేడు' కింద ఆర్వో ప్లాంట్ల ఏర్పాటు
- నిర్వహణకు 'అమ్మ ఒడి' పథకం నుంచి నిధుల కేటాయింపు
- కూటమి ప్రభుత్వంలో మూలకు చేరిన వాటర్ ప్లాంట్లు
- సురక్షిత తాగునీటికి విద్యార్థులు దూరం



ఎంటీసీపాలెం ఉర్దూ పాఠశాలలో నిరుపయోగంగా ఆర్వో ప్లాంటు



ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్‌లో మూలకు చేరిన ఆర్వో వాటర్ ప్లాంటు

సీతంపేట : వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 'నాడు – నేడు' అభివృద్ధి పనులతో జీవీఎంసీ పాఠశాలల రూపురేఖలు మారిపోయాయి. కార్పొరేట్ స్థాయిలో వసతులు కల్పించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు సురక్షిత తాగునీరు అందించడానికి ప్రభుత్వం బల్క్ ఆర్వో వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసింది. పిల్లల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని సురక్షిత తాగునీరు నిరంతరం అందించేలా లక్షలాది రూపాయలు ఖర్చు చేశారు. దీంతో విద్యార్థులకు తాగునీటి ఇక్కట్లు తొలగాయి. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆర్వో ప్లాంట్లు మూలకు చేరాయి. నిర్వహణ లోపంతో అలంకార ప్రాయంగా మారాయి. ఫలితంగా మునుపటిలా ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీటి ఇబ్బందులు ఏర్పడ్డాయి.

గతంలో అవసరమైతే మరమ్మతులు...

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టినప్పటి నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి పెట్టారు. తరగతి గదుల్లో డిజిటల్ క్లాసులు, టాయిలెట్లు, డెస్క్ బెంచీలు, విద్యుత్ లైట్లు, ఫ్యాన్లు, టాయిలెట్లలో నిరంతరం నీటి సరఫరా... ఇలా అన్ని రకాల సదుపాయాలు కల్పించారు. వీటన్నింటికీ తోడు విద్యార్థులకు నిరంతరం సురక్షిత తాగునీటి కోసం ఆర్వో వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేశారు. ఉత్తర నియోజకవర్గం లోని అన్ని జీవీఎంసీ ప్రాథమిక, ఉన్నత పాఠశాల్లో 'నాడు – నేడు' నిధులతో తాగునీటి కోసం బల్క్ ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేశారు. అలాగే వాటి నిర్వహణకు 'అమ్మ ఒడి' పథకం నిధుల నుంచి డబ్బులు చెల్లించి నిత్యం సర్వీసింగ్, రిపేర్ సదుపాయం కల్పించారు. ఎప్పుడు అవసరమైతే అప్పుడు కంపెనీ వారు వచ్చి మరమ్మతులు చేసేలా... అవసరమైనపుడు ఫిల్టర్లు మార్చే విధంగా చర్యలు తీసుకున్నారు.

మరమ్మతులు చేపట్టకే మూలకు...

26వ వార్డు ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్‌లో, 44వ వార్డు ఉర్దూ పాఠశాలలో ఆర్వో ప్లాంట్లు పని చేయడం లేదు. అలాగే మాధవధార ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, కె.కాలనీ ఉన్నత పాఠశాలలో ఆర్వో ప్లాంట్లు పని చేయడం లేదు. కప్పరాడ ఉన్నత పాఠశాలలో, రైల్వే న్యూ కాలనీ ప్రాథమిక పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్లు అలంకార ప్రాయంగా మారాయి. జీవీఎంసీ 25 వార్డు మధురానగర్‌లో ఉన్న ప్రాథమిక, ఉన్నత పాఠశాలకు వేర్వేరుగా ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ స్కూల్‌లో ఆర్వో ప్లాంటు పనిచేస్తోంది. ఉపాధ్యాయులు డబ్బులు చెల్లించి మరమ్మతులు చేయిస్తున్నారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించి ఆర్వో ప్లాంట్లు పునరుద్ధరించి సురక్షితమైన మినరల్ వాటర్ అందుబాటులోకి తేవాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.



కప్పరాడ ఉన్నత పాఠశాలలో మూలకు చేరిన ఆర్వో ప్లాంటు

ఇంట్లో కూడా లేని విధంగా..

జగన్ మామయ్య ముఖ్యమంత్రి అయ్యాక మా స్కూల్ రూపురేఖలు మారిపోయాయి. బాటిల్‌తో నీళ్లు తెచ్చుకోకుండా ఇంట్లో కూడా లేని విధంగా తాగడానికి మినరల్ వాటర్ అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రస్తుతం ఆర్వో ప్లాంట్ పనిచేయకపోవడంతో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నాం.
– ఎం.శ్రీనివాస్, విద్యార్థి, అక్కయ్యపాలెం.

ఇంటి నుంచి నీరు తెస్తున్నాం

మా పాఠశాలలో సురక్షిత తాగు నీరు కోసం ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేశారు. ఇంటి నుంచి వాటర్ బాటిల్ తేకుండా అందరం స్కూల్‌లో మినరల్ వాటర్ తాగేవాళ్లం. కొద్ది నెలలుగా ప్లాంట్ పని చేయడం లేదు. సురక్షిత నీటికి బదులు మోటార్ నీరు తాగుతున్నాం. కొంతమంది ఇంటి నుంచి బాటిల్‌తో నీరు తెచ్చుకుంటున్నారు.
– తస్లీమ్, విద్యార్థిని, ఉర్దూ స్కూల్

మట్టి దిబ్బలు తొలగించారు



మట్టి దిబ్బలు తొలగిస్తున్న జీవీఎంసీ వర్కర్లు

సీతమ్మధార : జీవీఎంసీ 14వ వార్డు పరిధిలో గల సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్సన్ ప్రాంతంలో కాలువ నిర్మాణ పనులు పూర్తయిన తర్వాత వదిలేసిన మట్టి దిబ్బలను జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారుల ఆదేశాల మేరకు సిబ్బంది సోమవారం తొలగించారు. 'మట్టి దిబ్బలతో ఇక్కట్లు' శీర్షికతో సాక్షిలో సోమవారం ప్రచురించిన వార్తకు అధికారులు స్పందించి మట్టి దిబ్బలను తొలిగించారు. దీంతో వాహనదారులు, పాదచారులు ఎప్పటిలాగే రాకపోకలు సాగిస్తున్నారు. తమ ఇబ్బందులు తొలగాయని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సాక్షి ఎఫెక్ట్..

గోదాదేవికి ప్రత్యేక పూజలు



గోదాదేవి అమ్మవారి విగ్రహంతో ఆలయ ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, భక్తులు

మురళీనగర్ : కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా గోదాదేవి అమ్మవారికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున వైభవుడికి ప్రాతఃకాలార్చన చేశారు. గోదాదేవి అమ్మవారి విగ్రహంతో అర్చకులు శేషాచార్యులు, భక్తులు మేళతాళాల మధ్య ప్రదక్షిణ చేశారు. అనంతరం ఆలయంలోకి తోడ్కొనిపోయి ప్రత్యేక పూజలు చేశారు. వైభవ వేంకటేశ్వరస్వామిని, గోదా అమ్మవారిని అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. గోదాదేవి అమ్మవారి తరఫున శ్రీరంగనాథునికి 8వ పాశురం చదివి వినిపించారు. ఈవో బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అనుమతి లేకుండా గ్రీన్‌బెల్ట్‌లో చెట్లు నరికివేత



గ్రీన్ బెల్ట్ ప్రాంతంలో తొలగించిన చెట్లు లెక్కిస్తున్న హార్టికల్చర్ అధికారులు

సీతంపేట : పర్యావరణాన్ని పరిరక్షించే పచ్చని గ్రీన్ బెల్ట్ ప్రాంతాన్ని కూడా కూటమి నాయకులు విడిచి పెట్టడం లేదు. నగరానికి మణిహారంగా వెలుగొందుతున్న జాతీయ రహదారికి అనుకున్ని ఉన్న గ్రీన్ బెల్ట్ ప్రాంతంలో చెట్లను కొంత మంది యువకులు సోమవారం నరికివేశారు. జీవీఎంసీ 44వ వార్డు పరిధిలో పల్లవి అపార్టుమెంట్ సమీపంలో జాతీయ రహదారికి అనుకుని ఉన్న గ్రీన్‌బెల్ట్ ప్రాంతాన్ని స్థానిక ముస్లిం యువకులు కొంత మంది కలిసి వాలీబాల్ కోర్టు కోసం చదును చేశారు. ఈ క్రమంలో సుమారు 13 చెట్లు నరికివేశారు. గ్రీన్‌బెల్ట్‌లో ఉన్న పచ్చదనాన్ని పూర్తిగా ధ్వంసం చేసి చదును చేశారు. స్థానికుల ఫిర్యాదుతో అక్కడికి చేరుకున్న జీవీఎంసీ అధికారులు, హార్టికల్చర్ అధికారులు విధ్వంసాన్ని పరిశీలించారు. చెట్లు తొలగించిన వారిని గుర్తించి, వారు ఉపయోగించిన పనిముట్లను సీజ్ చేశారు. గ్రీన్‌బెల్ట్ ప్రాంతంలో చెట్లు తొలగించకుండా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని, చెట్లు నరికేందుకు ఎవరికీ అనుమతి ఇవ్వలేదని హార్టికల్చర్ అధికారులు తెలిపారు. వాలీబాల్ కోర్టు ఏర్పాటుకు అనుమతి ఇవ్వలేదని జీవీఎంసీ జోన్ – 5 అధికారులు సైతం స్పష్టం చేశారు. కూటమి నాయకుల సహకారంతో సంబంధిత విభాగాల నుంచి అనుమతి లేకుండా గ్రీన్‌బెల్ట్ ప్రాంతంలో అడ్డగోలుగా చెట్లు తొలగించారని, పచ్చని చెట్లు నరికివేసి గ్రీన్‌బెల్ట్ ప్రాంతాన్ని చదును చేయడంపై స్థానికులు మండిపడుతున్నారు. చెట్లు తొలగించకుండా అభివృద్ధి చెయ్యాలని పలువురు కోరుతున్నారు. చెట్లు నరికిన వారిపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

క్రిస్మస్ సందడి



గణేష్‌నగర్‌లో ముస్తాబైన బేతల్ అసెంబ్లీ చర్చి



అక్కయ్యపాలెంలో విద్యుత్ దీపాల వెలుగులో చర్చి

సీతంపేట : విద్యుత్ దీపాల వెలుగులు, రంగు రంగుల స్టార్స్‌తో చర్చిలన్నీ క్రిస్మస్ వేడుకల కోసం ముస్తాబయ్యాయి. సీతంపేట గణేష్‌నగర్‌లోని బేతల్ అసెంబ్లీ చర్చిని విద్యుత్ దీపాలతో చూడముచ్చటగా అలంకరించారు. అలాగే అక్కయ్యపాలెం రామకృష్ణా నగర్, ఎన్జీజీవోస్‌కాలనీ, శ్రీనివాసనగర్‌లో గల చర్చిలను స్టార్స్, విద్యుత్ దీపాలతో అలంకరించారు. క్రిస్టియన్లు స్టార్స్, విద్యుత్ దీపాలు, క్రిస్మస్ ట్రీలతో తమ ఇళ్లను అందంగా అలంకరించారు. 25వ వార్డు పరిధి రెల్లివీధి, బీటీఆర్ నగర్, హరిజన వీధిలో ఇళ్ల ముందు స్టార్స్, విద్యుత్ దీపాలంకరణలతో సందడి నెలకొంది. క్రీస్తు జన్మించిన పశువుల పాక నమూనాను రెల్లివీధిలో ఏర్పాటు చేశారు. మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు ప్రార్థనలు చేస్తామని రెల్లివీధి యూత్ తెలిపారు.

పాలిటెక్నిక్ హాస్టల్ రక్షణ ప్రశ్నార్థకం..!

ప్రహరీ కూలినా పట్టించుకోని అధికారులు



మాణిక్యాంబ కాలనీ వైపు కూలిన గోడ

మురళీనగర్ : రాష్ట్రంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన కళాశాలగా పేరు పొందిన కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీకి రక్షణ కరువయ్యింది. ప్రవేశ ద్వారం నుంచి చుట్టూ నిర్మించిన ప్రహరీ గోడ వెనుక వైపు కూలిపోయి ఏడాదైనా పట్టించుకునే నాథుడే లేకుండాపోయాడు. మాణిక్యాంబ కాలనీ వైపు ఉన్న గోడ వర్షాలకు కూలిపోవడంతో రెగ్యులర్ విద్యార్థులతోపాటు హాస్టల్ విద్యార్థులకూ రక్షణ కరువయ్యింది. ఇటువైపు నుంచి ఎవరిష్టం వచ్చినట్టు వారు లోపలికి ప్రవేశిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇటు వైపే స్టూడెంట్స్ మేనేజ్‌మెంట్ వసతి గృహం కూడా ఉంది. ఇందులో సుమారు 250 మంది విద్యార్థులు ఉంటున్నారు. కూలిన గోడ పరిసరాలు విశాలంగా ఉండడంతో ఈ ప్రాంతంలోకి బయటి వ్యక్తులు ప్రవేశిస్తున్నారు. దీనివల్ల విద్యార్థుల్లో క్రమశిక్షణ లోపిస్తోందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. రాత్రి పూట అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. ఉదయం పూట మందుబాబులు ఈ ప్రాంతంలో ప్రవేశిస్తున్నారు. అల్లరిచిల్లరగా తిరిగే యువకులు ఇటువైపు నుంచి కాలేజీలోకి ప్రవేశిస్తున్నారు. కాలేజీలో అనేక అభివృద్ధి పనులు చేపడుతున్న అధికారులు అత్యంత ప్రాధాన్యత కలిగిన ప్రహరీ గోడ పునర్నిర్మించకపోవడం విడ్డూరంగా ఉంది. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకుని గోడ నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

భూ సమస్యలు పరిష్కరిస్తాం



సదస్సులో మాట్లాడుతున్న విష్ణుకుమార్ రాజు

మద్రిపాలెం : జీవీఎంసీ 50, 51వ వార్డుకు సంబంధించి భూ సమస్యలు పరిష్కరిస్తామని ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు అన్నారు. ఈ మేరకు 51వ వార్డు మాధవధార మాధవస్వామి కల్యాణ మండపంలో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా వార్డుల్లో 22ఏ భూములు, ఇళ్ల పట్టాలకు సంబంధించి, అలాగే సాయిరామ్ నగర్‌లో రోడ్డు ఏర్పాటుకు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి ప్రత్యేక జీవో తీసుకొచ్చేందుకు కృషి చేస్తామన్నారు. అంతకు ముందు కూటమి నాయకులు పలువురు జోన్ – 5 కమిషనర్ బి.రాము దృష్టికి వీధి దీపాల సమస్య తీసుకెళ్లగా... ప్రస్తుతం మరమ్మతులు మాత్రమే చేయించగలమని, కొత్తగా వీధి దీపాలు ఏర్పాటు చేయలేమని తేల్చి చెప్పారు. కొత్త లైట్ల కోసం టెండర్లు ఇంకా పిలవలేదన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి విశేష పూజలు



దాబాగార్డెన్స్: మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా 22వ రోజు సోమవారం కనక మహాలక్ష్మి అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. విశాఖతో పాటు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి మొక్కులు సమర్పించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. మధ్యాహ్నం టౌన్ కొత్తరోడ్డు సమీపంలోని జగన్నాథ స్వామి ఆలయంలో 1500 మంది భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శోభారాణి, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, వేద పండితులు, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల సమస్యలు త్వరగా పరిష్కరించాలి



ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో జెడ్సీ శివప్రసాద్

సీతమ్మధార : ప్రజల సమస్యలు త్వరగా పరిష్కరించాలని జోన్ – 3 జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్ సిబ్బందిని ఆదేశించారు. నగరంలోని ఆశీలుమెట్టలో గల కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి ఆయన ఫిర్యాదులు స్వీకరించారు. టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి ఇద్దరు ఫిర్యాదు చేశారని, వాటిని వెంటనే పరిష్కరించి ఫిర్యాదుదారులకు సమాచారం అందజేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇంజినీర్ పద్మావతి, విజయకుమార్, సహాయ వైద్యాధికారి డాక్టర్ భాస్కరరావు, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్, యూసీడీ విభాగం అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎల్.రాము, ఆర్‌వో పైడిరాజు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న తహసీల్దార్ రమేష్

సీతమ్మధార : సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అర్జీదారులు పలు సమస్యలకు సంబంధించి వినతులు అందజేశారు. తహసీల్దార్ ఎం.రమేష్ ఏడు వినతులు స్వీకరించారు. సమస్యలు త్వరగా పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఎ.త్రినాథ్, ఆర్ఐ ఇబ్రహీం, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ ఆవరణలో పేరుకుపోతున్న వాహనాలు



ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో పేరుకుపోయిన వాహనాలు

మధురవాడ డిపోకి తరలింపులో అలసత్వం

సీతమ్మధార : స్థానిక బాలయ్య శాస్త్రి లే అవుట్‌లో గల ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో మోటార్ వాహనాలు పేరుకుపోతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. నాలుగో పట్టణ, ద్వారకా పోలీస్ స్టేషన్ల పరిధిలో లా అండ్ ఆర్డర్, క్రైం, ట్రాఫిక్ విభాగాల పోలీసులు నమోదు చేసిన కేసులకు సంబంధించిన వాహనాలు ఇక్కడ ఏళ్ల తరబడి పేరుకుపోతున్నాయి. వాస్తవానికి గతంలో మధురవాడలో ఏర్పాటు చేసిన వాహనాల డిపోకి వీటిని విధిగా తరలించాలని గత పోలీస్ కమిషనర్లు ఆదేశించినా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇక్కడి వాహనాలకు మోక్షం లేకపోవడంతో ఎండకు ఎండి వానకు తడిసి పాడైపోతున్నాయని ఆందోళన వ్యక్తమవుతోంది. ద్విచక్ర వాహనాలతోపాటు కార్లు, ఆటోలు కూడా ఇక్కడే పేరుకుపోతున్నా సిబ్బంది పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్టేషన్‌కి ముందు భాగాన ప్రహరీ గోడకు ఆనుకుని వాహనాలు పేరుకుపోవడంతో ఇతర వాహనాల పార్కింగ్‌కి తీవ్ర ఆటంకం కలుగుతోందని ఫిర్యాదుదారులు ఆందోళన చెందుతున్నారు. అసలే స్టేషన్ ఆవరణ ఇరుకుమయం అనుకుంటే కేసుల్లో పట్టుబడిన వాహనాల కారణంగా పార్కింగ్ ప్రాంతం కుదించుకుపోయిందని పలువురు విచారం వ్యక్తం చేస్తున్నారు. ఇక వర్షాలు కురిసినపుడు పరిస్థితి మరీ ఇబ్బందికరంగా ఉంటోందని వాపోతున్నారు. ఇప్పటికైనా పోలీస్ ఉన్నతాధికారులు స్పందించి ఇక్కడి వాహనాలను మధురవాడలో గల డిపోకి తరలించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు ఏఎంసీ విద్యార్థులు



ఎంపికైన వైద్య విద్యార్థులను అభినందిస్తున్న ఏఎంసీ ప్రిన్సిపాల్ బుచ్చిరాజు

మహారాణిపేట: ఆంధ్రా మెడికల్ కాలేజీ ఎంబీబీఎస్ విద్యార్థులు బి.కిరణ్‌కుమార్(2021 బ్యాచ్), కాజల్ సింగ్ (2022 బ్యాచ్), డి.చరణ్‌నాయక్ (2024 బ్యాచ్) డాక్టర్ ఎన్‌టీఆర్ హెల్త్ విశ్వవిద్యాలయం అథ్లెటిక్స్(పురుషులు, మహిళలు) జట్టులో స్థానం సంపాదించారు. వీరు ఈ నెల 26 నుంచి 30 వరకు ఒడిశా రాష్ట్రం, భువనేశ్వర్‌లోని కళింగా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషియల్ సైన్సెస్ వద్ద జరగనున్న ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ అథ్లెటిక్స్ (పురుషులు, మహిళలు) చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా సోమవారం వీరిని కళాశాలలో ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, వైస్ ప్రెసిడెంట్(క్రీడలు) డాక్టర్ ఆర్.సునీల్‌కుమార్, శారీరక విద్యా డైరెక్టర్ డాక్టర్ ఎం.ఎస్.ఎన్.పాత్రుడు, డాక్టర్ ఆర్.ఎన్.భూషణరావు, డాక్టర్ పి.లక్ష్మణ్ రావు తదితరులు అభినందించారు. ఈ పోటీలకు ఎంపిక కావడం ఇతర వైద్య విద్యార్థులకు ప్రేరణగా నిలుస్తుందని ప్రిన్సిపాల్ అన్నారు.